ఆదివాసీ మహిళ ఈశ్వరమ్మకు న్యాయం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న భూరం అభినవ్

నిందితులను కాపాడుతున్నారని ఆరోపణలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆదివాసీ చెంచు మహిళ కాట్రాజు ఈశ్వరమ్మపై అత్యాచారం చేసి చిత్రహింసలకు గురి చేసిన బండి వెంకటేష్‌యాదవ్, బండి శివుడు, శివమ్మ, శామ్యూల్, సంధ్యలను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కుల నిర్మూలన పోరాట సమితి (కేఎన్‌పీఎస్) అధ్యక్షులు భూరం అభినవ్ డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేఎన్‌పీఎస్ ఆధ్వర్యంలో చెంచు మహిళా ఈశ్వరమ్మపై అత్యాచారం చేసి చిత్రహింసలకు పాల్పడిని వారిని శిక్షించాలని కోరుతూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా భూరం అభినవ్ మాట్లాడుతూ.. చెంచులపై జరుగుతున్న దౌర్జన్యాలపై సిట్టింగ్ హైకోర్టు న్యాయమూర్తిచే విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ఉన్న భూమిని కాజేయాలనే ఉద్దేశంతో ఈశ్వరమ్మను అక్రమంగా బంధించి వివిధ రకాలుగా చిత్రహింసలకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ పలుకుబడి స్థానిక మంత్రి అండదండలతో ఈ దుర్మార్గానికి పాల్పడ్డారని ఆరోపించారు. స్థానిక పోలీసులు ఈశ్వరమ్మ కేసును నీరుగార్చి పక్కదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని, కొందరు ఊర్లోనే యథేచ్ఛగా తిరుగుతూ బాధిత సాక్షులను బెదిరిస్తున్నారని మండిపడ్డారు. డీవీఎఫ్ జాతీయ కన్వీనర్ శంకర్, పిఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య, ప్రొఫెసర్ సూరెపల్లి సుజాత, పౌర హక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి నారాయణరావు, వివిధ సంఘాల నేతలు శ్రీదేవి, అంబయ్య, సమత, జయరాజు, లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

ఎస్సీ వర్గీకరణలో జాప్యంపై నిరసన



దీక్ష కరపత్రాన్ని విడుదల చేస్తున్న వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ

దీక్ష కరపత్రం ఆవిష్కరణ

ముషీరాబాద్: ఎస్సీ వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూలై 7న ఇందిరాపార్కు వద్ద దీక్ష చేపడుతున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ ప్రకటించారు. విద్యానగర్‌లోని రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు, జిల్లా అధ్యక్షుల సమావేశంలో ఆయన దీక్ష కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 30 ఏళ్ల వర్గీకరణ ఉద్యమం రాచపుండు లాగా రగులుతూనే ఉందని, వర్గీకరణ అంశాన్ని పరిష్కరించకుండా తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. రాజకీయ నాయకుల మాటలు నమ్మి ప్రతి విద్యా సంవత్సరం విద్యను నష్టపోతూనే ఉన్నామన్నారు. పార్లమెంటు సమావేశాలు నడుస్తున్నప్పుడైనా కనీసం వర్గీకరణ అంశాన్ని పార్లమెంటులో ప్రస్తావించలేదన్నారు. జూలై 7న ఇందిరా పార్కు వద్ద దీక్షకు పిలుపునిచ్చామని దీనికి పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. చిలకమర్రి గణేష్‌మాదిగ, హుస్సేన్, రమేష్, యాదగిరి, వేణుగోపాల్‌మాదిగ, చిన్నస్వామి, సారంగం, శ్రీనివాస్, మేడి మహేష్, బచ్చలకూరి నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి సత్కారం



శుభాకాంక్షలు తెలుపుతున్న గోవింద్‌నగర్ సంక్షేమ సంఘం సభ్యులు

అంబర్‌పేట: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి గోల్నాక డివిజన్ గోవింద్‌నగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. రెండోసారి కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆదివారం ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. సంక్షేమ సంఘం గౌరవ చైర్మన్ ప్రభాకర్, అధ్యక్షులు నర్సింగ్‌రావుయాదవ్, ఉపాధ్యక్షులు ఈశ్వర్, ప్రధాన కార్యదర్శి అరుణ్‌దాస్, సంయుక్త కార్యదర్శి గోపాల్, కోశాధికారి మురళి తదితరులున్నారు.

6న మెగా జాబ్ మేళా

అంబర్‌పేట: నిరుద్యోగ యువతీయువకుల కోసం జూలై 6 న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్, రాంకీ ఫౌండేషన్, లాయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ (గ్రీన్‌ల్యాండ్స్) సంయుక్తాధ్వర్యంలో జాబ్‌మేళా చేపట్టనున్నట్లు సంస్థ ప్రతినిధులు హరిసందీప్, మువ్వ రాంరెడ్డి, లక్ష్మీకుమారీలు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో ప్రముఖ సాఫ్ట్‌వేర్, ఫార్మ కంపెనీలతో పాటు ఇతర పేరొందిన సంస్థలు పాల్గొని వివిధ రకాల ఉద్యోగులను నియమించుకోనున్నట్లు వెల్లడించారు. పదోతరగతి నుంచి బీటెక్, ఎంబీఏ అర్హత గల నిరుద్యోగ యువతీయువకులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 18 - 30 ఏళ్లున్న వారు అర్హులు. ఈ జాబ్ మేళా రాణీగంజ్ గుజరాతీ హైస్కూల్ బోయగూడలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. మరిన్ని వివరాలకు పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

ప్రజా సమస్యలపై డీవైఎఫ్ఐ సంతకాల సేకరణ




రంగానగర్‌లో ప్రజల నుంచి సంతకాలను సేకరిస్తున్న దృశ్యం

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం భోలక్‌పూర్‌లో ప్రజల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కార్యదర్శి ఎండీ జావిద్ మాట్లాడుతూ.. స్థానికంగా డ్రైనేజీ, కలుషిత నీటిసరఫరా వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. డ్రైనేజీ మురుగు ఇళ్లలోకి రావడం వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. ఎన్నికలకు ముందు హడావిడిగా శంకుస్థాపనలు చేసి రోడ్లను తవ్వి వదిలేయడం వల్ల గుంతలమయంగా మారిన రోడ్లతో ప్రజలు అవస్తలు పడుతున్నారన్నారు. ప్రజా ప్రతినిధులు సమస్యలను పరిష్కరించాలని కోరారు. డీవైఎఫ్ఐ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు ఆశ్మీబాబు, నాయకులు వేణు, సల్మాన్, ఈశ్వర్‌బాబు, కృష్ణస్వామి పాల్గొన్నారు.

అమరుల త్యాగాలను గుర్తించడమే నిజమైన నివాళి

కార్గిల్ యోధుడు కెప్టెన్ నవీన్ నాగప్ప



కెప్టెన్ నవీన్ నాగప్పకు జ్ఞాపికను అందజేస్తున్న స్వామి బోధమయానంద

కవాడిగూడ: అమరవీరుల త్యాగాలను గుర్తించి గౌరవించడమే సైనికులకు ఇచ్చే నిజమైన నివాళి అని కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న కెప్టెన్ నవీన్ నాగప్ప పేర్కొన్నారు. జూలై 26న కార్గిల్ దివస్ రోజున దీపాలు వెలిగించి సైనిక అమరవీరులకు నివాళులర్పించాలని ఆయన సూచించారు. ఆదివారం రామకృష్ణమఠంలో జరుగుతున్న 'శౌర్య' శిబిరాన్ని సందర్శించి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. సమాజంపై భక్తి భావనతో సేవ చేయాలన్నారు. సైన్యంలో చేరి దేశ సేవ చేయాలనుకుంటున్న యువతను ఆయన అభినందించారు. అనంతరం రామకృష్ణమఠం అధ్యక్షులు స్వామి బోధమయానంద మెమోంటో శాలువాతో సత్కరించారు. హెచ్ ఆర్ ఎక్స్‌పర్ట్ ప్రత్యూష 'ఎఫెక్ట్యువ్ లీడర్‌షిప్' అనే అంశంపై మాట్లాడారు.

ఆత్మీయ సత్కారం



బుచ్చమాచార్యులను సన్మానిస్తున్న కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్

చిక్కడపల్లి: ఆర్టీసీక్రాస్‌రోడ్స్‌లోని లక్ష్మీగణపతి దేవాలయంలో శ్రీరాములు ఉపాలయంలో పూజారిగా విధులు నిర్వహించిన బుచ్చమాచార్యులు పదవీవిరమణ చేశారు. ఈ సందర్భంగా ఈఓ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ హాజరై బుచ్చమాచార్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గత 4 దశాబ్దాలకు పైగా లక్ష్మీగణపతి ఆలయంలో ఉన్న శ్రీ కోదండరామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాంనగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పేరుకుపోయిన డ్రైనేజీ, స్ట్రీట్ లైట్స్ తదితర స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ కె.రవిచారి అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని ఈడబ్ల్యూఎస్ క్వార్టర్స్‌లో డ్రైనేజీ పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. బోనాల పండుగ సమీపిస్తున్న సందర్భంగా దేవాలయాల వద్ద పేరుకుపోయిన సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని గుడి మరమ్మతులతో పాటు రోడ్డు ప్యాచ్‌వర్క్‌లను పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. నవీన్‌ముదిరాజ్, రవీందర్ ఉన్నారు.

నియామకాలు

లిబర్టీ: రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా కరణం కిషన్‌ను, గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శిగా పగడం శ్రీనివాసును ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బి.మహేశ్‌బాబు నియమించారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో వారికి నియామక పత్రాలను ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలజాతీయ కార్యదర్శి సి.బాలకృష్ణ, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.దుర్గప్రసాద్, ఉపాధ్యక్షుడు గెడ్డం శంకర్, నగర అధ్యక్షుడు జే.ఎల్ సుదీర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం

ఉత్తమ సేవలందించిన వారికి పురస్కారాల ప్రదానం



పురస్కార గ్రహీతలతో జస్టిస్ బూర్గుల మధుసూదన్, ఎస్పీ భారతి

చిక్కడపల్లి: ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని బతికించేది వైద్యులని విశ్రాంత న్యాయమూర్తి బూర్గుల మధుసూదన్ అన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం త్యాగరాయగానసభలో వైద్యరత్న, సేవారత్న పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిక చేసిన వైద్యులు, సమాజసేవకులకు ఆయన ముఖ్యఅతిథిగా పురస్కారాలను ప్రదానం చేసి సన్మానించారు. 'సమాజంలో వైద్యుని పాత్ర' అనే అంశంపై నిర్వహించిన కవిసమ్మేళనంలో కవులు పాల్గొని తమ స్వీయ కవితలను వినిపించారు. నాట్యగురువు ఎస్పీ భారతి, సినీదర్శకుడు చంద్రమహేష్, నిర్వహణ సంస్థ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు, వైద్యులు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ విశ్వదీప్, డాక్టర్ వరుణ్‌దీప్, డాక్టర్ సుజన్, ప్రముఖులు సురేష్, నరసింహులుగౌడ్, చల్లా భారతిరెడ్డి, శ్రీకళారెడ్డి, రమాదేవి తదితరులున్నారు.

క్యాబ్ డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

అంబర్‌పేట: క్యాబ్ డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సాధించుకుంటామని 'తెలంగాణ గిగ్ అండ్ ఫ్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్' వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ సలావుద్దీన్ ఆదివారం అంబర్‌పేట్‌లోని యూనియన్ కార్యాలయంలో క్యాబ్ డ్రైవర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము వాతావరణంతో సంబంధం లేకుండా విధులు నిర్వహించాల్సిన పరిస్థితులు ఉన్నాయని, పరిస్థితులకు అనుగుణంగా డ్రైవర్లు పనిచేసే విధానానికి కార్మిక శాఖ అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. వాతావరణంలో విపరీతమైన వేడి, వర్షాల్లో సైతం విధులు నిర్వహిస్తూ.. హిట్ స్ట్రోక్ వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనాల యజమానులు, కార్మికశాఖ డ్రైవర్ల సంక్షేమానికి పాటు పడేలా తమ సంఘం పనిచేస్తుందని వివరించారు.

ఫీజు బకాయిల విడుదలపై సీఎం స్పందించాలి



గుజ్జ సత్యం

కాచిగూడ: బీసీ విద్యార్థుల ఫీజు బకాయిల విడుదలపై సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. గత నాలుగేళ్లుగా ఉన్నత విద్యను అభ్యసించే లక్షలాది మంది బీసీ విద్యార్థులకు రూ.5 వేల కోట్లకు పైగా ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు రావాల్సి ఉందని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫీజు రీయంబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 6 నెలలు గడుస్తున్నా.. ఇప్పటి వరకు ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే ఫీజు బకాయిలు విడుదల చేసి వారి భవిష్యత్తుకు భరోసా కల్పించాలని కోరారు. లేదంటే జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

లైబ్రేరియన్ సహా అర్హులకు పదోన్నతి కల్పించాలి



డాక్టర్ బి.లక్ష్మయ్య

కాచిగూడ: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్‌లకు ప్రిన్సిపల్స్‌గా పదోన్నతి కల్పించాలని తెలంగాణ జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మయ్య, ప్రధానకర్యాదర్శి ఎం.పర్వతాలుగౌడ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రరీయన్లు సింగిల్ ప్రమోషన్ లేకుండా దాదాపు 20 నుంచి 30 ఏళ్లుగా ఒకే పోస్టులోనే పదవీవిరమణ చేస్తున్నారని వారు పేర్కొన్నారు. డబుల్ పీజీలు, డాక్టరేట్ ఉన్నప్పటికీ పీడీలుగా, లైబ్రేరియన్లకు ప్రమోషన్లు లభించడం లేదని వాపోయారు. స్కూల్ ఎడ్యుకేషన్‌లో పనిచేస్తున్న ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లకు స్కూల్ అసిస్టెంట్లు, హెడ్మాస్టర్లు, డిప్యూటీ విద్యాశాఖ అధికారులుగా ప్రమోషన్లు పొందుతున్నారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇప్పటికైనా జూనియర్ కళాశాల పీడీలకు లైబ్రరీలకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి ప్రభుత్వం పదోన్నతి కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఓ ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు.

టీ 20 ప్రపంచకప్-2024 సంబరాలు



కవాడిగూడ: టీ 20 వరల్డ్ కప్-2024 జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత్ గెలవడంపై బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా సంబరాలు చేసుకున్నారు. ఆదివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని శ్రీ కనకాల కట్ట మైసమ్మ దేవాలయంలో కవాడిగూడ బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎన్‌డీ. సాయికృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం ఎదుట 101 కొబ్బరికాయలు కొట్టి స్వీట్లు పంపిణీ చేశారు. ముఠా జైసింహ, ముఠా శివ, వల్లాల శ్రీనివాస్‌యాదవ్, దీన్‌దయాల్ రెడ్డి, సంతోష్, బీంరాజ్, వంశీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పార్టీల ఫిరాయింపును ప్రోత్సహించొద్దు

లిబర్టీ: పార్టీల ఫిరాయింపులను ప్రోత్సహించడం మంచి సంస్కృతి కాదని లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, జాతీయ కార్యదర్శి పుల్లూరు వెంకటరాజేశ్వరరావు అన్నారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక పార్టీ నుంచి గెలుపొందిన సుమారు ఆరుగురు ఎమ్మెల్యేలను స్వయంగా సీఎం చొరవ తీసుకుని ఫిరాయింపులను ప్రోత్సహించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఎన్నికలో సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్నారు. రైతు రుణమాఫీ, రైతుబంధు, సకాలంలో వేయాలని ప్రతి మహిళకు రూ. 2500 తక్షణమే చెల్లించాలని కోరారు. అలాగే ఉద్యోగాల భర్తీ చేపట్టాలని కోరారు.

ఆర్థికంగా వెనుకబడిన పద్మశాలీలను ఆదుకోవాలి



సమావేశంలో కందగట్ల స్వామి, పుట్ట పాండురంగయ్య తదితరులు

కాచిగూడ: ఆర్థికంగా వెనుకబడిన నిరుపేద పద్మశాలీలను విద్య, వైద్యపరంగా ఆదుకోవడానికి ఇంజనీర్స్ ముందుకు రావాలని అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి పిలుపునిచ్చారు. అఖిల భారత పద్మశాలీ ఇంజనీర్స్ విభాగ్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పుట్ట పాండురంగయ్య అధ్యక్షతన ఆదివారం నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పద్మశాలీలు రాజకీయంగా, సామాజిక, ఆర్థికంగా ఎదిగేందుకు ప్రయత్నించాలని సూచించారు. పద్మశాలీలు వ్యక్తిగతంగా అభివృద్ధి చెందడంతో పాటు అట్టడుగున ఉన్నవారిని ఆదుకోవాలన్నారు. పద్మశాలి సంఘం జాతీయ ప్రధానకార్యదర్శి గడ్డం జగన్నాథం, ఇంజనీర్స్ విభాగ్ ప్రధాన కార్యదర్శి మోహన్‌నారాయణ, చంద్రమౌళి, వేణుమాధవ్, రాజ్‌కుమార్, లోక్‌నాథం, మద్దాల మోహన్‌కుమార్, విజయప్రసాద్, క్రిష్ణ, సుధాకర్, రవీందర్, శంకర్, డా.మార్కెండేయ, యాదగిరి, శ్రీనివాస్, నరేందర్, మురళి, జితేందర్, శంకర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రాలనగర్ సమస్యలను పరిష్కరించాలి



చిత్రాలనగర్‌లో నిరసన చేస్తున్న దృశ్యం

కవాడిగూడ: కవాడిగూడ డివిజన్ చిత్రాలనగర్ బస్తీలో రెండేళ్ల క్రితం అభివృద్ధి పనుల్లో భాగంగా ఫ్లోరింగ్, సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి నేటివరకు పనులు ప్రారంభించలేదని బస్తీవాసులు ఆదివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ రచనశ్రీ అధికారులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బస్తీ నాయకులు యాదగిరి, జీవన్, భరత్, క్రాంతి, మహిళలు సరిత, అనిత, కరుణశ్రీలు మాట్లాడుతూ.. రెండేళ్లుగా తమ చుట్టు పక్క ప్రాంతాల్లో ఉన్న బస్తీల్లో డ్రైనేజీ, తాగునీరు, సీసీరోడ్లు ఏర్పాటు చేసినప్పటికీ కేవలం చిత్రాలనగర్‌లో దళితులు నివసిస్తున్నందుకే తమ పట్ల వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్, అధికారులకు వినతిపత్రాలు అందజేశామన్నారు. వర్షాకాలంలో సమస్య మరింత తీవ్ర కానుందని దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రజా ప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు. లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

మోదీ హయాంలోనే దేశ సమగ్రాభివృద్ధి



స్థానికులతో ప్రధాని మన్‌కీ బాత్‌లో పాల్గొన్న బీజేపీ నేత బిజ్జి కనకేష్‌కుమార్

ముషీరాబాద్: ప్రధాని నరేంద్రమోదీ హయాంలోనే దేశం సమగ్రాభివృద్ధి చెందిందని బీజేపీ ఓబీసీ రాష్ట్ర కో- ఆర్డినేటర్ బిజ్జి కనకేష్‌కుమార్ అన్నారు. మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన ప్రధాని నరేంద్రమోదీ ఆదివారం మొదటిసారి మన్‌కీబాత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. భోలక్‌పూర్ డివిజన్‌లోని మహాత్మానగర్‌లో బిజ్జి కనకేష్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రజలకు ప్రధాని మోదీ సందేశాన్ని మైక్‌ద్వారా వినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నరేంద్రమోదీ అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. అందువల్లే ప్రజలు మరోసారి ప్రధానిగా చేశారన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నామని తెలిపారు. బీజేపీ నేతలు మహాత్మనగర్ బస్తీవాసులు పాల్గొన్నారు.

నల్లకుంట: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ విధిగా ఓ మొక్కను నాటి దాని సంరక్షణ బాధ్యత తీసుకోవాలని బీజేపీ మైనార్టీ మోర్చా మీడియా కన్వీనర్ ఎం. ఐజాక్‌రాజ్ కోరారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం నిర్వహించిన మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ మైనార్టీ మోర్చా మీడియా కన్వీనర్ ఎం.ఐజాక్‌రాజ్ నల్లకుంట డివిజన్ 7వ బూత్ కమిటీ సభ్యులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పిలుపు మేరకు భూమాతను తల్లిగా భావించి ఆ తల్లి పేరు మీద ఓ మొక్కను నాటాలని నిర్ణయించామన్నారు.

కవాడిగూడ: బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ మల్లంపేట రమేష్‌రాం ఆధ్వర్యంలో మన్‌కీబాత్‌లో పాల్గొన్నారు. డివిజన్ అధ్యక్షుడు మహేందర్‌బాబు, డివిజన్ ప్రధాన కార్యదర్శి కేశవరాజు, సీనియర్ నాయకుడు రమేష్‌గౌడ్, రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు సారంపల్లి మల్లారెడ్డి, జంగారెడ్డి తదితరులు

చిక్కడపల్లి: పెట్టుబడి ధరలకు అనుగుణంగా పంటలకు కనీస మద్దతు ధరలను ప్రకటించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా పంటలకు ధరలను పెంచకపోవడాన్ని నిరసిస్తూ జూలై 12వ తేదీల్లో సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని సంఘం కార్యాలయంలో కార్యక్రమ పోస్టర్‌ను నేతలు సారంపల్లి మల్లారెడ్డి జంగారెడ్డి, ప్రసాదరావులతో కలసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రప్రభుత్వం జూన్ 19న 14 పంటలకు ప్రకటించిన మద్దతుధరలకు అనుగుణంగా లేవన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం మద్దతు ధరల చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ రాష్ట్రాల తరహాలో పంటలకు మద్దతు ధరలను నిర్ణయించి అమలు చేయాలన్నారు.

సంచార జాతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న వంటెద్దు నరేందర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో సంచార జాతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర సంచార జాతుల సంఘం అధ్యక్షులు నరేందర్ డిమాండ్ చేశారు. సంచార జాతులకు ఐదు శాతం రిజర్వేషన్లను విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో కల్పిస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని కోరారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంచార జాతుల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలోని ఇటీవల మృతి చెందిన సంఘం నాయకులు అడ్వకేట్ అబ్బు లింగం, వీరయ్య సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడిన సంచార జాతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నామినేటెడ్ పదవుల్లో సంచార జాతులకు అవకాశం కల్పించాలని విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. రాష్ట్ర కమిటీ చైర్మన్ వెంకటనారాయణ, వైస్ చైర్మన్ సమయ్య, ప్రధాన కార్యదర్శి నాగరాజు, యూత్ అధ్యక్షులు బండారి యువరాజ్, మహిళా అధ్యక్షురాలు సావిత్రి, తోట అనిత, కోనేరు శ్రీనివాస్, పొన్నాల కుమార్, శ్యామల యాదగిరి తదితరులున్నారు.